క్లుప్తంగా

ఉచిత కంటి వైద్య శిబిరం



మేడ్చల్: పట్టణంలోని 18వ వార్డులో జీవికే అంజు ఐ కేర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంకు మంచి స్పందన లభించింది. వార్డు కౌన్సిలర్ భవాని రాఘవేంద్రగౌడ్ శిబిరంను ప్రారంభించారు. శిబిరానికి హాజరైన వారికి వైద్యులు కంటీ పరీక్షలు చేసి మందులు అందజేశారు. కంటి చికిత్సలు అవసరమైన వారికి ఆసుపత్రిలో 20 శాతం రాయితి ఇస్తున్నట్లు వైద్యులు తెలిపారు. 120 మంది వరకు శిబిరంకు హాజరు కాగా 20 మందికి చికిత్సలు అవసరమని వైద్యులు తెలిపారు.

అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి తదితరులు

కీసర: నాగారం మున్సిపాలిటీ అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయడం జరుగుతుందని మున్సిపల్ చైర్మన్ కౌకుట్లచంద్రారెడ్డి అన్నారు. బుధవారం మున్సిపల్ పరిధిలోని 10వ వార్డులోని సింహపూరి కాలనీలో సుమారు 19.5 లక్షల నిధులతో చేపట్టనున్న అంతర్గత మురికికాలువ నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ బండారి మల్లేషయాదవ్, కౌన్సిలర్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బూత్ అధ్యక్షుల ఎన్నిక

మేడ్చల్‌రూరల్: మండలంలోని ఎల్లంపేట్ గ్రామంలో బీజేపీ పార్టీ నూతన బూత్ అధ్యక్షులను ఎన్నుకున్నారు. జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు జగన్‌గౌడ్ ఆధ్వర్యంలో 17వ బూత్ అధ్యక్షులుగా కోరుపర్తి యాదగిరి, 18 బూత్ అధ్యక్షులుగా హరిప్రసాద్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌గౌడ్, రమేష్, శ్రీనివాస్, గణేష్, మారుతి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ధనుర్మాస పూజలు

ఘట్‌కేసర్: ఎదులాబాద్‌లోని శ్రీ గోదాసమేత రంగనాయక స్వామి ఆలయంలో ధనుర్మాస పూజలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ పూజారులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, ఆరగింపు నిర్వహించి, భక్తులకు తిరుప్పావై వినిపించారు. అమ్మవారికి చీరలు, గాజులు, ఒడి బియ్యం సమర్పించారు. ఆయా వేడుకల్లో భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

అయోధ్య రాముడి పాదుకల ఊరేగింపు



మేడ్చల్: హైదరాబాద్ నుంచి అయోధ్యకు వెళ్తున్న రాముడి బంగారు పాదుకలకు మేడ్చల్‌లో భక్తులు ఘనంగా స్వాగతం పలికారు. మంగళవారం రాత్రి మున్సిపాలిటీ పరిధిలోని అత్వెల్లి శివాలయంలో బస చేసిన అయోధ్య రాముడి పాదుకలను బుధవారం అత్వెల్లిలో ఊరేగించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సరిత మల్లేష్‌గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సత్యనారాయణ, నాయకులు ఈశ్వరయ్య, రవి కుమార్, పాండు, యాదగిరి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు మంటలు అంటుకుని.. మహిళ సజీవదహనం



భాగ్యమ్మ (ఫైల్)

శామీర్‌పేట్: కొవ్వొత్తి వెలిగించగా.. ప్రమాద వశాత్తు మంటలు అంటుకుని మహిళ సజీవదహనమైంది. ఈ ఘటన బుధవారం వెలుగు చూసింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం...శామీర్‌పేట మండలం పొన్నాల్ గ్రామానికి చెందిన ఉదరి భాగ్యమ్మ (40) కూలీ పనిచేస్తూ జీవనం సాగిస్తుంది. ఆమె భర్త 15 రోజుల క్రితం పని నిమిత్తం కరీంనగర్‌కు వెళ్లాడు. మంగళవారం రాత్రి భాగ్యమ్మ ఇంట్లో కొవ్వొత్తి వెలిగించి మంచం సమీపంలో ఉంచి నిద్రపోయింది. ఈక్రమంలో కొవ్వొత్తి మంటలు బెడ్‌షీట్‌కు అంటుకుని మంటలు చెలరేగాయి. బుధవారం ఉదయం భాగ్యమ్మ ఇంటి నుండి పొగలు రావడంతో గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించగా అప్పటికే మృతిచెందింది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తులో ఉంది.

చచ్చినా చావే..

శ్మశానాలకు దారేదీ..?

- జవహర్‌నగర్‌లో శ్మశాన వాటిక స్థలాల దుస్థితి
- ఆక్రమణల్లో శ్మశాన స్థలాలు
- అంత్యక్రియలకు నానా అగచాట్లు పడుతున్న వైనం
- చనిపోతే ఆరడుగుల స్థలం కావాలంటున్న స్థానికులు



జవహర్‌నగర్‌లో పిచ్చిమొక్కలు, చెట్లతో ఉన్న శ్మశాన వాటికలు



అంబేడ్కర్‌నగర్‌లో పిచ్చిమొక్కల మధ్య దహన సంస్కారాలు చేస్తున్న కుటుంబ సభ్యులు

జవహర్‌నగర్: చనిపోయిన వారికి అంత్యక్రియలు నిర్వహించే మరుభూమి సౌకర్యాల మాట అటుంచితే కనీసం నడవడానికి కూడా దారిలేని పరిస్థితి. శ్మశానవాటికలకు ప్రహరీ లేకపోవడంతో ఆక్రమణలకు ఎంతమేరకు గురి అయ్యాయో తెలియని పరిస్థితి నెలకొంది. జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలో బాలాజీనగర్, చెన్నాపురం, మల్కారం, అంబేడ్కర్‌నగర్, రాజీవ్‌గాంధీనగర్, వికలాంగుల కాలనీ ప్రాంతాలలో శ్మశానవాటికలున్నాయి. ఒకప్పుడు హిందువులు కర్మకాండలు నిర్వహించేందుకు అసౌకర్యానికి గురయ్యేవారు. నీరు అందుబాటులో లేక వేసవి తాపానికి, మరోపక్కన కాళ్లల్లో ముళ్లు గుచ్చుకుని బాధ పెడుతుండగా కార్యక్రమాలు కొనసాగించేవారు. అయితే దాతల సహకారంతో కొన్ని శ్మశానవాటికల రూపు రేఖలు మారాయి. కానీ మరి కొన్ని శ్మశానవాటికలలో ముళ్లకంపలు పెరిగి చిట్టడివిని తలపిస్తూ.. విషసర్పాలకు నిలయంగా మారాయి. లోతట్టు ప్రాంతాల్లో ఉండడంతో వర్షం కురిసిన సమయాలలో సమస్య మరింత ఝటిలంగా తయారవుతోంది. కొన్ని ప్రాంతాలలో శ్మశాన వాటికలు కబ్జాకు గురువడంతో అంతిమ సంస్కారానికి కూడా చోటు దొరక్క ప్రజలు నానా అగచాట్లు పడుతున్నారు.

కబ్జా చేస్తే కఠిన చర్యలు..



జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలో కేటాయించిన శ్మశాన వాటిక స్థలాలను కబ్జా చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం. కార్పొరేషన్ పరిధిలోని బాలాజీనగర్, చెన్నాపురం, అంబేడ్కర్‌నగర్, మల్కారం, అరుంధతినగర్, రాజీవ్‌గాంధీ నగర్, వికలాంగుల కాలనీ ప్రాంతాలలో కేటాయించిన శ్మశానవాటికలలో దాదాపు అన్నింటికీ ప్రహరీ నిర్మాణాలు ఏర్పాటు చేశారు. మరో రెండు మూడు శ్మశానవాటికలకు ప్రహరీ నిర్మించాల్సి ఉంది. జవహర్‌నగర్ జనాభాకు అనుగుణంగా మరికొంత స్థలాన్ని శ్మశానవాటికలకు కేటాయించాల్సి ఉంది. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించేలా కృషి చేస్తాము.

– సుచరిత, కాప్రా మండల తహసీల్దార్

మౌలిక సదుపాయాలు కల్పించాలి



జవహర్‌నగర్‌లో ఉన్న శ్మశానవాటికలలో మౌలిక సదుపాయాలు లేక కుటుంబ సభ్యులు ఇబ్బందులు పడుతున్నారు. స్నానాల గది, నీళ్ల సౌకర్యంలేక నానా అవస్థలు పడుతున్నారు. పిచ్చి మొక్కలు, ముళ్ల కంపలతో శ్మశానవాటికలు ఉన్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మౌలిక సదుపాయాలు కల్పించి, శ్మశానవాటిక స్థలాలను కాపాడాల్సిన అవసరం ఉంది.

– జక్కుల శ్రీనివాస్, జ్యోతిరావ్‌పూలే కాలనీ, జవహర్‌నగర్

మెప్మా ఆర్పీల సమస్యలు వెంటనే పరిష్కరించాలి



సాక్షి,సిటీబ్యూరో: హరితహారం, పట్టణ ప్రగతి, తడి, పొడి చెత్త, డబల్ బెడ్ రూమ్ ఇళ్లు, అనాధ పిల్లల సర్వే, బతుకమ్మ చీరల పంపిణీ, బీఎల్‌ఓ డ్యూటీలు, మహిళలకు బ్యాంకు రుణాలు ఇప్పించడం, స్త్రీ నిధి రుణాల పంపిణీ తదితర పనులతో ప్రభుత్వానికి అన్ని విధాలుగా సేవలందిస్తున్న మెప్మా ఆర్పీల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు అశోక్ డిమాండ్ చేశారు. బుధవారం మేడ్చల్ కలెక్టరేట్ వద్ద మెప్మా ఆర్పీల ధర్నాలో ఆయన మాట్లాడారు. మెప్మా ఆర్పీలకు నెలకు రూ. 6000 ఇచ్చి చేతులు దులుపుకోవడం దారుణమని ఆయన పేర్కొన్నారు. ఆర్పీల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోతే ఉద్యమాన్ని చేపడతామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. జీవో నెంబర్ 60 ప్రకారం వీరికి కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలన్నారు. ఆర్పీలందరికీ రూ. 10 లక్షల సాధారణ భీమా సౌకర్యం కల్పించాలన్నారు. ఆర్పీలకు ప్రతినెల రెగ్యులర్‌గా వేతనాలు వారి వ్యక్తిగత ఖాతాల ద్వారా చెల్లించాలన్నారు. ఒకే రకమైన డ్రెస్ కోడ్ అమలు చేయాలన్నారు. ఆర్పీలందరికీ గుర్తింపు కార్డులు, హెల్త్ కార్డులు ఇవ్వాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పించటంతోపాటు అధికారుల వేధింపులను అరికట్టాలన్నారు.

ఆర్పీల నూతన జిల్లా కమిటీ

ధర్నా అనంతరం ఆర్పీల నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షురాలుగా బాలమణి, కార్యదర్శిగా నంద, ఉపాధ్యక్షులుగా లక్ష్మి, కవిత, సహాయ కార్యదర్శులు వినోద, జ్యోతి, కోశాధికారిగా సునీత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

సమగ్ర శిక్షా ఉద్యోగుల డిమాండ్లు నెరవేర్చాలి



సాక్షి,సిటీబ్యూరో: తెలంగాణ విద్యాశాఖ సమగ్ర శిక్షలో కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు తమ సమస్యలు పరిష్కరించాలని మేడ్చల్ కలెక్టరేట్ వద్ద చేపట్టిన నిరసన దీక్షలు బుధవారం వరకు 9వ రోజుకు చేరుకుంది. వీరి ఆందోళనకు వివిధ సంఘాలు సంఘీభావం ప్రకటించటంతోపాటు మద్దతుగా నిరసన దీక్షల్లో భాగస్వామ్యాన్ని పంచుకున్నారు. సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని ఆయా సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. జిల్లా స్థాయిలో సిస్టం అనలిస్ట్, ఆపరేటర్లు, డేటా ఎంట్రీ, స్పెషల్ ఆఫీసర్స్, అటెండర్స్ తదితర విభాగాలలో పని చేస్తున్న ఉద్యోగులు 9వ రోజులుగా సమ్మె చేస్తున్నా పట్టించుకోకపోవటంపై ఆందోళన వ్యక్తం చేశారు. సమగ్ర శిక్షా ఉద్యోగులందరిని విద్యాశాఖలో విలీనం చేసి, రెగ్యులర్ చేయాలని, ఉద్యోగ భద్రతతో కూడిన పేస్కేల్ ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు ఫణికుమార్, ప్రతినిధులు దేదీప్య, మల్లేష్, కిరణ్, స్వామి, సత్యనారాయణ, ఇందిరా, మధులత, నిర్మల పాల్గొన్నారు.

వివిధ సంఘాల మద్దతు

న్యాయమైన డిమాండ్ల సాధన కోసం మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద సమ్మె చేస్తున్న విద్యాశాఖలోని సమగ్ర శిక్షా ఉద్యోగులకు ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రామేశ్వర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యాక్షుడు ఆంజనేయులు, ప్రతినిధులు నర్సింహాగౌడ్, దయాకర్, వినోద్ జాదవ్‌తో పాటు టీఎస్ యూటీఎఫ్, ఎస్టీయూ, టీయూటీఎఫ్ సంఘాలు సంపూర్ణ మద్దతు తెలిపాయి.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

జవహర్‌నగర్: అనుమానాస్పద స్థితిలో ఓ మహిళ మృతి చెందిన ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నేపాల్‌కి చెందిన ప్రకాష్ విశ్వకర్మ, దుర్గ (18) ప్రేమించుకొని ఆరు నెలల క్రితం వివాహం చేసుకొని యాప్రాల్ శ్రీదేవినగర్‌లో నివాసముంటున్నారు. ఈ నెల 17న దుర్గా పనికి వెళ్లి వచ్చి పడుకుంది. పని నుంచి ఇంటికి వచ్చిన భర్త ప్రకాష్ దుర్గను లేపడానికి ప్రయత్నించగా ఎంతకూ లేవలేదు. దీంతో భర్త వెంటనే 108కి ఫోన్ చేయగా.. అంబులెన్స్ సిబ్బంది దుర్గను పరీక్షించి వెంటనే స్థానికంగా ప్రైవేట్ ఆసుత్రికి తరలించారు. అప్పటికే దుర్గ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. దుర్గ మృతి పై అనుమానం వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

గంజాయి చాక్లెట్ విక్రేతల అరెస్ట్



పోలీసుల అదుపులో నిందితులు



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి చాక్లెట్లు

పోచారం: గంజాయి చాకెట్లు విక్రయిస్తున్న వ్యక్తులను ఎస్ఓటీ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్ నుంచి గంజాయి చాకెట్లను తీసుకొచ్చి అన్నోజిగూడలో అమ్ముతున్న ఇద్దరు వ్యక్తులను ఎస్ఓటీ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితులు బీహార్ రాష్ట్రానికి చెందిన రామ్ నారాయణ్ షా (33), కిషోర్ కుమార్ (22)గా గుర్తించారు. వీరు అన్నోజిగూడ ఫ్లైఓవర్ వద్ద కాశీ విశ్వనాథ్ టీ పాయింట్ నిర్వహిస్తూ గంజాయి చాక్లెట్లను వినియోగదారులకు విక్రయిస్తున్నట్లు పోలీసుల విచారణలో తెలిసింది. వీరి వద్ద దొరికిన 230 చాక్లెట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

రూ. లక్ష విలువైన మద్యం స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

మేడ్చల్‌రూరల్: వైన్ షాపులో అమ్మాల్సిన మద్యాన్ని నిబంధనలకు విరుద్ధంగా బార్‌లో అమ్మకాలు జరుపుతుండగా దాడులు నిర్వహించిన రంగారెడ్డి ఎస్‌టీఎఫ్‌బి బృందం రూ.1.05 లక్షల విలువైన మద్యాన్ని స్వాధీనం చేసుకున్న ఘటన మేడ్చల్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మేడ్చల్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ఎంఎస్ హార్ట్ కెఫే రెస్టారెంట్ అండ్ బార్‌లో మద్యం దుకాణాల్లో(వైన్స్)లో అమ్మాల్సిన మద్యాన్ని బార్‌లో అమ్ముతున్నట్లు సమాచారం అందుకున్న ఎస్‌టీఎఫ్‌బి బృందం మంగళవారం రాత్రి దాడులు నిర్వహించారు. బార్‌లో ఉన్న ఓడ్కా, విస్కీ బాటిళ్లపై ఉన్న బార్‌కోడ్‌లను తనిఖీ చేయగా బార్‌కు సంబంధించిన మద్యం కాకపోవడంతో పోలీసులు వాటిని స్వాధీనం చేసుకున్నారు. అనుమతి లేని మద్యాన్ని బార్‌లో అమ్ముతున్న బార్ యజమానిపై కేసు నమోదు చేసి పోలీసులకు అప్పగించారు. పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం విలువ రూ.1.05 లక్షల విలువ ఉంటుందని తెలిపారు.

చలో రాజ్‌భవన్‌కు తరలిన కాంగ్రెస్ నాయకులు



కీసరలో.. రాజ్‌భవన్ ముట్టడికి తరలివెళ్లిన కాంగ్రెస్ నేతలు



ఘట్‌కేసర్‌లో...



జవహర్‌నగర్‌లో..

కీసర: కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో నగరంలోని రాజ్‌భవన్‌ముట్టడి కార్యక్రమానికి నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీల నుంచి పెద్ద ఎత్తున కాంగ్రెస్ నేతలు, నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. కీసర మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కృష్ణాయాదవ్, వర్కింగ్‌ప్రెసిడెంట్ రామిడి విజయ్‌రెడ్డి, నాగారం మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్ రెడ్డి, దమ్మాయిగూడ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు ముప్ప రామారావు, కాంగ్రెస్ నేతలు జూపల్లి రవీందర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘట్‌కేసర్‌లో..

టీపీసీసీ పిలుపు మేరకు చలోరాజ్‌భవన్ కార్యక్రమంలో పాల్గొనడానికి ఘట్‌కేసర్ మున్సిపాలిటీ కాంగ్రెస్ నాయకులు బుధవారం పట్టణం నుంచి తరలి వెళ్లారు. అంతకు ముందు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ బీ-బ్లాక్ అధ్యక్షుడు మహేష్‌గౌడ్, మున్సిపల్ చైర్‌పర్సన్ పావనీజంగయ్య, కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షప్రధాన కార్యదర్శి ముత్యాలుయాదవ్, రాధాకృష్ణ ముదిరాజ్, ఉపాధ్యాయుడు నాగరాజముదిరాజ్, కౌన్సిలర్ మల్లేష్, డీసీసీ కార్యదర్శి ఆంజనేయులుయాదవ్, జంగయ్యయాదవ్, అంజిరెడ్డి, రమేష్, పరమేశ్‌గౌడ్, యూత్‌కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు సంజీవరెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మహా పాదయాత్ర



మేడ్చల్: దేశంలో గోరక్ష, భూరక్ష చేయాలని కోరుతూ హైదరాబాద్‌కు చెందిన పర్యావరణ వేత్త బాలకృష్ణ కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు చేపట్టిన మహాపాదయాత్ర బుధవారం మేడ్చల్‌కు చేరింది. జాతీయ రహదారి పై మేడ్చల్‌లో పాదయాత్రకు హిందూ సంఘాల వారు, అయ్యప్పస్వాములు, ప్రకృతి ప్రేమికులు స్వాగతం పలికారు. పట్టణంలోని వివేకానంద విగ్రహం నుంచి అయ్యప్ప ఆలయం వరకు పాదయాత్ర నిర్వహించారు.

విద్యార్థులతో చైర్మన్ సహపంక్తి భోజనం



సహపంక్తి భోజనం చేస్తున్న చైర్మన్ కొండల్‌రెడ్డి

పోచారం: అన్నోజిగూడలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చైర్మన్ కొండల్‌రెడ్డి విద్యార్థులతో కలిసి బుధవారం సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలలో ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని, సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో హెచ్ఎం స్వరూప, మాజీ ఉపసర్పంచ్ బాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారం ఎంతో అభినందనీయం

మేడ్చల్: కంపెనీలకు చెందిన యజమానులు, గ్రామాలలో తమ సీఎస్ఆర్ నిధులు వెచ్చించి అభివృద్ధి పనులు చేయడం గొప్ప విషయమని మండలంలోని డబీల్‌పూర్‌కు చెందిన మండల బీఆర్ఎస్ సీనియర్ నాయకులు భాగ్యారెడ్డి అన్నారు. డబీల్‌పూర్‌లోని ప్రైమరీ పాఠశాలలో అడ్వంట ఎంటర్‌ప్రైజెస్ కంపెనీ వారు 9 లక్షల సీఎస్ఆర్ నిధులతో చేపట్టిన ఫ్లోర్ టైల్స్ నిర్మాణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కంపెనీల వారు తమ సీఎస్ఆర్ నిధులతో గ్రామాలలో అభివృద్ధి పనులు చేపట్టడం అభినందనీయమన్నారు. దాతలు మరింత ముందుకు వచ్చి గ్రామాలలో అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు. అడ్వంట కంపెనీ ప్రతినిధులను మాజీ ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి, మాజీ సర్పంచ్ గీత భాగ్యారెడ్డి అభినందించారు. గ్రామాలలో కంపెనీలకు అవసరమైన అన్ని రకాల ప్రోత్సాహం అందిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ కో ఆప్షన్ సభ్యుడు గౌస్, నాయకులు దమోదర్‌రెడ్డి, అశోక్, శ్రీనివాస్ కంపెనీ ప్రతినిధులు వెంకట రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అవగాహన

మేడ్చల్‌రూరల్: సైబర్ మోసాలపై ప్రతీ ఒక్కరికి అవగాహన అవసరమని సైబర్ క్రైమ్ వాలంటీర్ శశి, ఇన్‌స్పెక్టర్ సుధీర్ కృష్ణ అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం సైబర్ మోసాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సైబర్ నేరగాళ్ల మోసాలకు ఎలా పాల్పడతారో వివరించారు. మ్యూల్ అకౌంట్స్ ముఖ్యంగా రాజస్థాన్, ఢిల్లీ, ముంబై తదితర ప్రాంతాలలో ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. కొరియర్‌లో డ్రగ్స్ వచ్చాయని వాటి నుండి రక్షణ పొందడానికి ఆధార్‌నెంబర్, బ్యాంకు వివరాలు తెలిపాలని కోరుతూ ఏ పోలీస్ అధికారి ఆన్‌లైన్, వీడియో కాల్ ద్వారా విచారణ చేయరని తెలిపారు. మొబైల్ హ్యాక్, డిజిటల్ అరెస్టులపై వీడియోల ద్వారా వివరించారు. ఈ సందర్భంగా వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలత, పీఆర్వో రవిసుధాకర్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ రాజేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సైబర్ నేరాల నియంత్రణ అవగాహన పోస్టర్ ఆవిష్కరిస్తున్న విద్యార్థులు

పన్నుల వసూళ్లపై స్పెషల్ ఫోకస్

- పట్టణాలు, గ్రామాల్లో పేరుకుపోయిన పాత బకాయిలు
- ఈ ఆర్థిక సంవత్సరంలో వసూళ్ల లక్ష్యం రూ.182 కోట్లు
- వసూలైన పన్ను శాతం 54.80
- స్పెషల్ డ్రైవ్‌తో రంగంలోకి ప్రత్యేక బృందాలు
- వందశాతం వసూళ్లే లక్ష్యంగా ప్రత్యేక కార్యాచరణ



సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని పట్టణాలు (పురపాలికలు), గ్రామ పంచాయతీ (జీపీ)ల్లో పాత బకాయిలతో పాటు వంద శాతం పన్నుల వసూళ్లపై అధికార యంత్రాంగం దృష్టిసారిస్తోంది. వచ్చే మార్చితో 2024–25 ఆర్థిక సంవత్సరం ముగియనుండటంతో లక్ష్యాన్ని అధిగమించేలా పురపాలక సంఘాలు, జీపీలు స్పెషల్ డ్రైవ్‌కు సిద్ధమవుతున్నాయి. వీరిని రంగంలోకి దింపటం ద్వారా ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో ఇంటింటికీ వెళ్లి పన్నులు వసూలు చేయాలని భావిస్తుంది. ఇంకా మూడు నెలలు మాత్రమే గడువు ఉండటంతో స్పెషల్ డ్రైవ్ చేపట్టేందుకు అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. పట్టణాలు, జీపీల్లో పన్నుల వసూళ్లను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. లేని పక్షంలో పురపాలక సంఘాలు, గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి కుంటుపడగలదని అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే పన్ను వసూళ్ల లక్ష్యం చేరుకునేందుకు శతవిధాలా ప్రయత్నించాలని భావిస్తోంది.

పట్టణాలు.. జీపీల్లో పన్నుల లక్ష్యం రూ.182 కోట్లు

మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలోని 13 పురపాలక సంఘాలతోపాటు 34 గ్రామ పంచాయతీల్లో వివిధ రకాల పన్నుల వసూళ్ల లక్ష్యం రూ.182 కోట్లు (పురపాలక సంఘాల్లో రూ.172 కోట్లు, జీపీల్లో రూ.10.76 కోట్లు) కాగా, ఇప్పటి వరకు 54.80 శాతం పన్నుల వసూళ్లు చేశారు. వచ్చే మార్చి 31తో ఆర్థిక సంవత్సరం ముగుస్తుండటంతో.. అప్పటి వరకు వంద శాతం పన్నుల వసూళ్ల కోసం స్పెషల్ డ్రైవ్‌కు అధికార యంత్రాంగం మొగ్గు చూపుతోంది. మార్చి 31 వరకు పన్ను చెల్లించిన వారికి వడ్డీ మినహాయింపు ఇవ్వగా, ఆ తర్వాత చెల్లించిన వారికి 2 శాతం చొప్పున పన్నుపై వడ్డీ విధిస్తారు. పట్టణాలు, జీపీల్లో ప్రైవేట్ ఆస్తుల పన్నులు సకాలంలో వసూలవుతున్నా.. ప్రభుత్వ ఆస్తులకు సంబంధించిన పన్నులు మాత్రం ఏటా పెరిగిపోతున్నాయి.

పేరుకుపోయిన బకాయిలతో కష్టాలు..

పట్టణాలు, గ్రామ పంచాయతీల్లో ప్రతి ఏటా సకాలంలో పన్నులు వసూలు కావటం లేదు. రూ. కోట్లల్లో బకాయిలు పేరుకుపోతుండటంతో అభివృద్ధి కార్యక్రమాలకు ఆటంకం కలుగుతోంది. దీనికి తోడు పురపాలక సంఘాలు, జీపీల్లో పని చేస్తున్న సిబ్బంది జీతభత్యాలు కూడా సకాలంలో చెల్లించలేని దుస్థితి ఏర్పడింది. ఇలాంటి పరిస్థితి నుంచి పట్టణాలు, జీపీలు బయటపడాలంటే పన్నులు సకాలంలో వసూలు కావాల్సిన అవసరం ఉంది.